క్లుప్తంగా

నేడు మండల పరిషత్ సమావేశం

పమిడిముక్కల: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు జరుగుతుందని ఎంపీడీఓ విశల్‌పాల్ తెలిపారు. ఎంపీపీ కాసాని వేద సుప్రజ అధ్యక్షతన సమావేశం జరుగుతుందని చెప్పారు. మండలంలోని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు సమావేశానికి తప్పక హాజరు కావాలని కోరారు.

రూ.8.5 లక్షల ప్రోత్సాహక బహుమతులు పంపిణీ



గుడివాడ టౌన్: విద్య నేర్చుకోడానికి పేదరికం అడ్డురాకూడదని ఎస్‌బీఐ విశ్రాంత జనరల్ మేనేజర్ ఆరికెపూడి వీర బ్రహ్మారావు అన్నారు. ఆదివారం స్థానిక రాజేంద్రనగర్‌లోని జీవీ పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాలులో కమ్మ మహాజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన విద్యార్థులకు పారితోషకాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సామాజిక ఉన్నతికి కమ్మ మహాజన సంఘం చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. మొత్తం రూ.8.50 లక్షలను విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులుగా అందజేశామన్నారు. కమ్మ మహాజన సంఘం నాయకులు డాక్టర్ మన్నెం భవానీశంకర్, డాక్టర్ వల్లూరుపల్లి సుబ్రహ్మణ్యేశ్వర రావు, ఏకే చటర్జి, పలువురు మహాజన సంఘం నాయకులు పాల్గొన్నారు.

సుబ్బారాయుడి సన్నిధిలో భక్తుల సందడి



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధిచెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని శ్రీసుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. జిల్లాతోపాటు ఇతర జిల్లాలోని అనేక ప్రాంతాలనుంచి భక్తులు ఆలయానికి చేరుకుని స్వామిని దర్శించుకున్నారు. గుడివాడ 11వ అడిషనల్ డిస్ట్రిక్ట్ జడ్జి జి.సుబ్రహ్మణ్యం దంపతులు ఆలయం వద్ద పుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకున్నారు. తొలుత ఆలయ చైర్మన్ శొంఠి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య, అర్చకులు పూర్ణకుంభంతో, ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. దర్శనం అనంతరం ఆలయ చరిత్ర, అభివృద్ధి గురించి న్యాయమూర్తికి వివరించారు. స్వామివారి శేషవస్త్రాలు, మెమెంటోతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

ఆధార్ కార్డుల అందజేత

కైకలూరు: పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులకు నూతన ఆధార్ కార్డులను ప్రాజెక్టు నవయాన్ ద్వారా ఆటపాక గ్రామంలో ఆదివారం అందించారు. వివిధ ప్రాంతాలకు చెందిన 4 కుటుంబాల్లో 10 మందికి ఆధార్ కార్డులు లేవు. దీంతో ఆటపాకలో ప్రాజెక్ట్ నవయాన్ (హ్యూమన్ రైట్స్ ఇనిషియేటివ్)లోభాగంగా పారిశుద్ధ్య కార్మికుల చిరునామాలను అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్, జాన్ పేటకు మార్చారు. సభ్యులు పోస్టల్‌శాఖద్వారా ప్రత్యేక క్యాంపును ఏర్పాటు చేశారు. తమకుఆధార్ కార్డులను అందించిన నవ యాన్ ప్రాజెక్టు, పోస్టల్‌శాఖ సిబ్బందికి పారిశుద్ధ్య కార్మికులు ధన్యవాదాలు తెలిపారు. ప్రాజెక్ట్ నవయాన్ అధ్యక్షుడు వంగలపూడి విజయ్, జాన్‌పేట యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ రాయినూతల సుధీర్, తలారి జాన్, కుమ్మరిగుంట మదన్, పాలపర్తి రాకేష్, గురజాల ప్రదీప్, మాసిపోగు గౌతమ్, కూనవరపు రాజశేఖర్,మంతినపల్లియోహాన్ పాల్గొన్నారు.

గుండెపోటుతో వలంటీర్ మృతి



కలిదిండి: ఎస్‌ఆర్‌పీ అగ్రహారంలో గ్రామ సచివాలయ వలంటీర్ కట్టా ఉదయశంకర శివకుమార్ (25) ఆదివారం ఉదయం గుండెపోటుతో మృతి చెందాడు. శివకుమార్ రెండు సార్లు సేవా మిత్ర అవార్డు పొందాడు. తండ్రి వెంకటేశ్వరరావు, తల్లి నాగమణి, అన్నయ్య అమలేశ్వరరావు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తారు. ఎమ్మెల్యే దూలం నాగేశ్వర రావు తనయుడు దూలం వీర ఆది వినయ్ కుమార్ శివకుమార్ భౌతికకాయాన్ని సందర్శించి పూల మాల వేసి నివాళులర్పించారు. పెరుమాళ్ళ మల్లయ్య స్వామి, కట్టా లక్ష్మణరావు, దొడ్డాకుల పండు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు పాల్గొని సంతాపం తెలిపారు.

కషాయం తయారీ

మండవల్లి: కొర్లపాడులో తూటికాడ కషాయం తయారీ విధానం, ఉపయోగాలు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది ఆదివారం వివరించారు. డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ వరిలో దోమల ఉధృతి నివారించడానికి, 6 లీటర్ల తూటికాడ కషాయం, 100 లీటర్ల నీటిలో కలుపుకుని ఎకరా వరిపంటపై పిచికారి చేసుకోవాలన్నారు. మండల ఇన్‌చార్జి నాగవిజయ, ఐసీఆర్పీలు రామారావు, నాగవాణి, రైతులు కృష్ణమూర్తి, సత్యనారాయణ పాల్గొన్నారు.

బస్సు యాత్రను విజయవంతం చేయండి

- ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్
- ఈనెల 9న పామర్రులో సామాజిక సాధికార బస్సు యాత్ర



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్, పక్కన ప్రజాప్రతినిధులు, నాయకులు

పమిడిముక్కల: ఈ నెల 9న పామర్రులో జరిగే సామాజిక సాధికార బస్సుయాత్రను విజయవంతం చేయాలని పామర్రు ఎమ్మెల్యే కై లే అనిల్ కుమార్ కోరారు. ఆదివారం మండలంలోని మర్రివాడ, గోపువానిపాలెం, తాడంకి, గురజాడ, మంటాడ, కపిలేశ్వరపురం, పమిడిముక్కల తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే విస్తృతంగా పర్యటించారు. ఆయా గ్రామాల్లో పార్టీ శ్రేణులతో బస్సుయాత్రపై సమీక్ష చేశారు. తాడంకిలో జెడ్పీటీసీ సభ్యురాలు యేసుగ వెంకట రమణకుమారి నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే అనిల్‌కుమార్ మాట్లాడుతూ 9వ తేదీన మధ్యాహ్నం 2 గంటలకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాల నాయకులతో సామాజిక సాధికార బస్సుయాత్ర ఉంటుందన్నారు. ఈ యాత్రలో మంత్రి జోగి రమేష్, ఉపముఖ్యమంత్రి అంజద్‌బాషా, ఎంపీ నందిగం సురేష్, పెనమలూరు శాసనసభ్యులు కొలుసు పార్థసారథి పాల్గొంటారని తెలిపారు. 15 వేల మందితో భారీ బహిరంగసభ నిర్వహిస్తున్నామన్నారు.

గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యం..

గాంధీ కలలుగన్న గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌తోనే సాధ్యమని ఎమ్మెల్యే అన్నారు. గ్రామాలే కేంద్రంగా సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసి ప్రజల ముంగిటకే సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. గత టీడీపీ పాలనకు, వైఎస్సార్ సీపీ నాలుగున్నరేళ్ల పాలనకు తేడా గమనించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 98 శాతం పూర్తి చేసినట్లు చెప్పారు. విద్యా, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారని, గడప గడపలో ప్రతి సచివాలయంలో రూ.20 లక్షలతో మౌలిక సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. ఆరోగ్య సురక్ష శిబిరాలు ప్రజలకు ఎంతో మేలు చేశాయని, అవసరమైన వారికి మెరుగైన వైద్య సేవలందిస్తున్నామన్నారు. జర్నలిస్టులకు ప్రభుత్వం ఇళ్ల స్థలాలు మంజూరు చేయడం సంతోషకరమన్నారు. నియోజకవర్గంలో అర్హత కలిగిన వారికి స్థలాలు ఇప్పించేందుకు చర్య తీసుకుంటానన్నారు. బడుగు వర్గాల జీవన ప్రమాణాలు పెంచి, పేదవాడి రాతను మార్చింది సీఎం జగన్ మాత్రమేనని కొనియాడారు. సమావేశంలో రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి వెంకటేశ్వరరావు, రాష్ట్ర రెడ్డిక కార్పొరేషన్ డైరెక్టర్ కంభపు రాంబాబు, పీఏసీఎస్ అధ్యక్షుడు బొర్రా చినబాబు, వైస్ ఎంపీపీ కొడమంచిలి మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, పార్టీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, కాసాని శ్రీనివాసరావు, మారపాక మహేష్, కొడాలి రాంబాబు, కూచిపూడి వీరాస్వామి, కూచిపూడి వెంకటేశ్వరరావు, పులి గంగాధరరావు, కూనపరెడ్డి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ల నమోదు



నందివాడ మండలంలో క్యాంపును పరిశీలిస్తున్న ఆర్డీఓ పద్మావతి

ముదినేపల్లి రూరల్: నియోజకవర్గంలో ఓటర్ల నమోదు, సవరణల కార్యక్రమం పారదర్శకంగా జరుగుతున్నట్లు నియోజకవర్గ ఈఆర్వో కె.బాబ్జి అన్నారు. మండలంలోని పలు పోలింగ్ బూత్‌లను తహసీల్దార్ కె.శ్రీనివాస్‌తో కలిసి ఆదివారం ఆయన పరిశీలించారు. బీఎల్‌వోల నుంచి ఈప్రక్రియకు సంబంధించి వివరాలు సేకరించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ వచ్చే జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించబడుతుందన్నారు. జాబితాల్లో సవరణలకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. తహసీల్దార్ శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేందుకు బీఎల్‌వోలను సమన్వయపరుస్తూ గ్రామాల్లో ప్రజలను చైతన్యవంతం చేస్తున్నట్లు చెప్పారు. ఆన్‌లైన్ ద్వారా ఓటుహక్కు కోసం దరఖాస్తు చేసుకునే అవకాశం ఉందన్నారు.

గుడివాడ టౌన్(నందివాడ): బూత్ లెవల్ ఆఫీసర్స్ (బీఎల్‌ఓలు) ఓటర్లకు పూర్తి సమాచారం అందించాలని ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. ఆదివారం నందివాడ మండలం పుట్టగుంట, నందివాడ, పెదలింగాల గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద బీఎల్‌ఓల పనితీరును పరిశీలించారు. వారి వద్ద ఉన్న ఓటర్ల జాబితాను పరిశీలించి సందేహాలు నివృత్తి చేశారు. ఓటు వివరాలు తెలుసుకునేందుకు వచ్చిన ఓటర్ల సందేహాలు కూడా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సవరించిన ఓటర్ల జాబితా అందుబాటులో ఉంచామన్నారు. ప్రతి ఓటరూ తమ ఓటు ఉన్నదీ లేనిది తెలుసుకుని ఓటరుగా నమోదుకావాలని కోరారు. ఈ కార్యక్రమంలో నందివాడ తహసీల్దార్ వి.భవన్నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పామర్రు: మండల పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ క్యాంపులను తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి ఆదివారం పరిశీలించారు. మండలంలోని పసుమర్రు, రిమ్మనపూడి, కొండిపర్రు, పామర్రు మార్కెట్ యార్డు, అరండాల్‌పేట, గంగులవాని చెరువు తదితర ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పామర్రు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో వచ్చే నెల డిశంబర్ 3,4 తేదీల్లో కూడా మరలా స్పెషల్ క్యాంపెయిన్ ఉంటుందన్నారు. ముసాయిదా జాబితాపై డిశంబర్ 9 వరకు అభ్యంతరాలు స్వీకరించి డిశంబరు 26లోగా వాటిని పరిష్కరిస్తామని తెలిపారు. 2024 జనవరి 5వ తేదీన తుది ఓటర్ల జాబితా ప్రచురితమవుతుందన్నారు. ఈకార్యక్రమంలో ఎన్నికల డీటీ జగన్‌మోహన్‌రావు, ఎన్నికల సిబ్బంది రాము, శ్రీనివాసరావులు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: పట్టణంలోని అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద సవరించిన ఓటర్ల జాబితా అందుబాటులో ఉన్నట్లు మున్సిపల్ కమిషనర్ వి. మురళీకృష్ణ అన్నారు. ఆదివారం పట్టణంలోని పలు పోలింగ్ కేంద్రాల వద్ద ఆయన ఓటర్లతో చర్చించారు. ఓటు వివరాలు సక్రమంగా ఉన్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. ఓటర్ల జాబితాపై ఓటర్ల స్పందన ఎలా ఉంది అనే అంశాన్ని బీఎల్‌ఓల వద్ద అడిగి తెలుసుకున్నారు. గత రెండు రోజులుగా నిర్వహించిన ఈ ప్రత్యేక శిబిరాలకు మంచి స్పందన వచ్చిందని, తిరిగి డిసెంబర్ 2, 3 తేదీల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తామన్నారు. ఓటర్ల జాబితాను పోలింగ్ కేంద్రాల వద్ద ఆ రోజు అందుబాటులో ఉంచుతామన్నారు. ఓటర్లే కాక రాజకీయ ప్రతినిధులు సైతం ఓటర్ల జాబితాను పరిశీలించుకోవచ్చన్నారు.

పామర్రు(పెదపారుపూడి): మండలంలోని వెంట్రప్రగడ గ్రామంలో పోలింగ్ బూత్‌లను ఆదివారం మండల తహసీల్దార్ వీ నాగభూషణం పరిశీలించారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ కొత్త ఓటుకు నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ పీ రవికుమార్, బీఎల్వోలు చాట్ల అజయ్‌కుమార్, రాధాకుమారి, ఎస్ఎన్‌సీ వెంకట్, శ్యామ్ పాల్గొన్నారు.

మండవల్లి: మండలంలోని 49 పోలింగ్ బూత్‌లలో బీఎల్‌ఓలు ఆదివారం ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. మండవల్లి ఎంపీపీ స్కూల్–1 లోని పోలింగ్ కేంద్రం వద్ద బీఎల్‌ఓ కమలహాసన్ ఓటర్ల నమోదు ప్రక్రియ చేపట్టారు. బీఎల్ఏ మెండా సురేష్ ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. బీఎల్‌ఓలు శ్రీనివాస్, నాగూర్, బి.దినేష్ పాల్గొన్నారు.

కలిదిండి: మండలంలో 63 పోలింగ్ కేంద్రాలలో ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ దశిక వంశీ మాట్లాడుతూ ఈ ప్రత్యేక ఓటర్ల నమోదు కార్యక్రమం నిర్వహించిన రెండు రోజుల్లలో 133 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. తప్పుల సవరణలకు 30, కొత్త ఓటర్లు నమోదుకు 76, చనిపోయిన వారి ఓట్ల తొలగింపు 27 దరఖాస్తులు అందాయన్నారు. కార్యక్రమంలో ఈఆర్‌ఓ కే.బాబ్జి, బీఎల్వోలు పాల్గొన్నారు.

కైకలూరు: నియోజకవర్గంలో మొత్తం 235 పోలింగ్ బూత్‌లు ఉండగా 20 పోలింగ్ బూత్‌లను కైకలూరు నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారి కె.బాబ్జి పరిశీలించారు. ఆయా బూత్‌ల వద్ద కొత్త ఓటర్లను చేర్చడం, మరణించిన వ్యక్తుల పేర్లు తొలగించడం, మార్పులకు సంబంధించిన అర్జీలను బీఎల్‌వోలు తీసుకున్నారు. వివిధ పార్టీలకు చెందిన బూత్ లెవల్ నాయకులు ఓటర్ల జాబితాను పరిశీలించుకున్నారు.

సామాజిక న్యాయం సీఎం జగన్‌కే సాధ్యం



మాట్లాడుతున్న నారాయణమూర్తి

గుడివాడ టౌన్: రాష్ట్రంలో సామాజిక న్యాయం సీఎం వైఎస్ జగన్ మోహనరెడ్డి ప్రభుత్వం లోనే సాధ్యమవుతుందని నవరత్నాల కమిటీ వైస్ చైర్మన్ అంకెరెడ్డి నారాయణమూర్తి అన్నారు. ఆదివారం స్థానిక శ్రీరామ్‌పురంలోని గుడివాడ వెలమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఐక్యవేదిక సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విడి విడిగా ఉన్న వెలమ సంఘాలన్నింటినీ ఒకే వేదికపైకి తెచ్చి జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) ఏర్పాటు చేయడానికి నాయకులంతా సిద్ధం కావాలన్నారు. బీసీల అభ్యున్నతికి ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. బీసీ సంఘాలు నిర్వహించే ప్రతి కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, దానిని వినియోగించుకోవాలన్నారు. పార్టీలకు అతీతంగా బీసీల హక్కుల సాధనకు నాయకులు కృషి చేసినప్పుడే సామాజిక వర్గం లాభపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వెలమ సంఘం రాష్ట్ర నాయకులు తెంటు సత్య, తిరుపతి నాయుడు, మూకల అప్పారావు, గులిపల్లి ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

అలరించిన పాట కచేరి

గుడివాడ టౌన్: స్థానిక రాజేంద్రనగర్ లోని జీవీ పూర్ణచంద్రరావు కమ్యూనిటీ హాలులో స్పందన కల్చరల్ ఆర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో లక్కవరం శ్రీనివాస్ బృందం నిర్వహించిన అక్కినేని వారి ఆపాత మధుర సినీ గీతాలాపన పలువురిని ఆకట్టుకుంది. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంకు చెందిన ప్రముఖ గాయకులు ప్రేక్షకులను అలరింపజేశారు. స్పందన గౌరవ అధ్యక్షుడు డాక్టర్ వల్లూరుపల్లి సుబ్రహ్మణ్యేశ్వరరావు, గౌరవ సలహాదారు కేఏస్ అప్పారావు, అధ్యక్షుడు గవిర్నేని బాబూ శ్రీకర్, ఉపాధ్యక్షులు మట్టా రాజా, పీవీ సత్యన్నారాయణ, కార్యదర్శి నరహరశెట్టి ప్రసాదు, సహ కార్యదర్శి వంగా శ్రీనివాస్ (వంశీ), కోశాధికారి కొనకళ్ల సీతయ్య, సంయుక్త కార్యదర్శి డాక్టర్ కేవీఎస్‌బీ శర్మ తదితరులు పాల్గొన్నారు.



పాటలు ఆలపిస్తున్న గాయకులు

కూచిభొట్ల సేవలు ప్రశంసనీయం



కూచిభొట్ల అవధాని కళావేదికను ప్రారంభించిన ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్

పమిడిముక్కల: మండలంలో కృష్ణాపురం శివారు నారాయణపురంలో కూచిభొట్ల అవధాని జ్ఞాపకార్థం కుమారులు ఎస్ఆర్ఐ కిరణ్‌కుమార్, పవన్ స్నేహ హస్తాలు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కళావేదిక నిర్మించారు. కుంతీదేవి పండగ సందర్భంగా ఎమ్మెల్యే కైలే అనిల్‌కుమార్ కళావేదికను ఆదివారం ప్రారంభించి గ్రామస్తులకు అందించారు. కళావేదిక నిర్మించి ఇచ్చినందుకు కిరణ్, పవన్‌లను ఎమ్మెల్యే అభినందించారు. రాష్ట్ర గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ శొంఠి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీలు గంజాల సీతారామయ్య, కొడమంచిలి మహేష్, మండల పార్టీ అధ్యక్షుడు యలమంచిలి గణేష్, మండల సచివాలయ కన్వీనర్ పరసా జగన్, పార్టీ నాయకులు యేనుగ మస్తాన్‌రావు, కాసాని శ్రీనివాసరావు, వీరంకి చిరంజీవి, యారగడ్డ శివ తదితరులు పాల్గొన్నారు.

అన్నసమారాధన



మండవల్లి: దసరా ఉత్సవాల ముగింపు సందర్భంగా చింతపాడులో ఆదివారం అన్నసమారాధన నిర్వహించారు. ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నప్రసాదాన్ని వడ్డించారు. నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.

రేపు సామాజిక తనిఖీ ప్రజావేదిక

పామర్రు: ఈనెల 7న సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో వై.రామకృష్ణ ఆదివారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం 2022–23 ఏడాదికి సంబంధించిన 15వ విడత సామాజిక తనిఖీలో గుర్తించిన అంశాలపై ప్రజావేదికలో చర్చిస్తామన్నారు. ఆ రోజు ఉదయం 10గంటలకు మండల ఉపాధి కార్యాలయం వద్ద గ్రామ స్థాయిలో అక్టోబరు 10వ తేదీ నుంచి నవంబరు 6 వరకు నిర్వహించిన సామాజిక తనిఖీ నివేదికలపై చర్చ ఉంటుందన్నారు. గుర్తించిన అంశాలపై ప్రజా ప్రతినిధులు, మండల స్థాయి అధికారులు, ఉపాధి హామీ సిబ్బంది ఆయా అనుబంధ శాఖల అధికారులు పాల్గొంటారని తెలిపారు.

బ్యాంక్ సేవలపై కళాజాతా



జమీగొల్వేపల్లిలో అవగాహన కల్పిస్తున్న కళాజాతా బృందం

జమీగొల్వేపల్లి(పామర్రు): జిల్లా సహకారం కేంద్ర బ్యాంకు ఆధ్వర్యంలో నాబార్డు వారి సౌజన్యంతో మండలంలోని జమీగొల్వేపల్లిలోని స్థానిక పీఏసీఎస్ వద్ద డిజిటల్ లావాదేవీల గురించి కళాజాత కార్యక్రమం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పీఏసీఎస్ అధ్యక్షురాలు కనుమూరి ధనలక్ష్మి మాట్లాడుతూ బ్యాంక్ అందించే రుణ సౌకర్యాలు, ప్రతి ఒక్కరూ పొదుపు ఖాతాలను ప్రారంభించాలన్నారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన అటల్ పెన్షన్ యోజన, కిసాన్ క్రెడిట్ కార్డు, నగదు రహిత లావాదేవీలు, ఏటీఎం, రూపే, డిబెట్ కార్డులను ఏవిధంగా వినియోగించాలనే అంశాలను కళాజాత బృందం సభ్యులు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు వల్లభనేని బుల్లిబాబు, కొల్లి గోపాలకృష్ణ, వీ నాగేశ్వరరావు, పీఏసీఎస్ సీఈవో శ్రీలక్ష్మి, సిబ్బంది చిన్ను, స్థానికులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బంది లేకుండా భూముల కొనుగోలు

ఉయ్యూరు ఆర్డీవో రాజు



రైతులతో మాట్లాడుతున్న ఉయ్యూరు ఆర్డీవో రాజు

పామర్రు: రైతుల ప్రయోజనాలను పరిగణలోకి తీసుకుని పేదల కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసే జగనన్న కాలనీలకు అవసరమైన భూములు కొనుగోలు చేస్తామని ఉయ్యూరు ఆర్డీవో దాసి రాజు అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో స్పందన ఫిర్యాదు దారులైన రైతులతో ఆయన సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గ్రామంలో ఉన్న జగనన్న కాలనీ కోసం కొనుగోలు చేసిన భూముల పక్కనే ఉన్న రైతులు జిల్లా కలెక్టర్‌కు స్పందనలో ఇచ్చిన ఫిర్యాదు మేరకు రైతులతో సమావేశమైనట్లు చెప్పారు. గతంలో ఏర్పాటు చేసిన కాలనీ పక్క భూములను కొనుగోలు చేసే విధంగా చర్యలు తీసుకుంటామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో పరిస్థితిని గమనించి మరో మారు రైతులతో సమావేశం ఏర్పాటు చేస్తామని వివరించారు. భూముల విషయంలో రైతులు ఎవరికి ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనని అన్నారు. అన్ని శాఖల అధికారులు, రైతులతో కలిసి క్షేత్ర పరిశీలనకు సోమవారం హాజరు కావాలని ఆదేశించారు. తహసీల్దార్ వీవీ భరత్‌రెడ్డి, మండల సర్వేయర్ పర్వీన్ సుల్తానా, రెవెన్యూ అధికారులు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

మంచి ప్రవర్తనతో మెలగాలి

సీఐ కిషోర్‌బాబు



రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ కిషోర్‌బాబు

పమిడిముక్కల: రౌడీ, సస్పెక్ట్ షీట్ హోల్డర్స్ సత్ప్రవర్తన అలవర్చుకోవాలని పమిడిముక్కల సీఐ ఎం.కిషోర్‌బాబు తెలిపారు. సీఐ కార్యాలయంలో ఆదివారం సర్కిల్ పరిధిలోని తోట్లవల్లూరు, పమిడిముక్కల స్టేషన్ల పరిధిలోని రౌడీ, సస్పెక్ట్ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. తమ పనితీరు మార్చుకొని సమాజంలో మంచి ప్రవర్తనతో మెలగాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో జరిగే నేరాలకు దూరంగా ఉండాలని, అల్లర్లు సృష్టించి ప్రజలకు ఇబ్బంది కలిగిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్లపై నిరంతరం పోలీస్ నిఘా ఉంటుందని, రౌడీయిజం, బెదిరింపులు, పంచాయితీల్లో తలదూరిస్తే ఉపేక్షించేదిలేదన్నారు. సర్కిల్ పరిధిలో ఉన్న సస్పెక్ట్ షీట్ హోల్డర్స్ అసాంఘిక కార్యకలాపాలకు, చట్టవ్యతిరేకమైన చర్యలకు, కోడిపందేలు, పేకాట, చిత్తులాట నిర్వహిస్తే నగర బహిష్కరణ చేయడానికి వెనుకాడబోమన్నారు. రౌడీ షీటర్లు తమ నేరస్వభావం మార్చుకోవాలని, మంచి నడవడిక కలిగిన వారిపై రౌడీషీట్లు తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామని తెలిపారు. కార్యక్రమంలో తోట్లవల్లూరు ఎస్ఐ విశ్వనాథ్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనులపై గ్రామ సభ



మాట్లాడుతున్న జిల్లా రిసోర్సు పర్సన్ లక్ష్మి

పామర్రు: మండల పరిధిలో రూ.85 లక్షల నిధులతో 100 ఉపాధి పనులను నిర్వహించామని ఎన్ఆర్‌ఈజీఎస్ జిల్లా రిసోర్సు పర్సన్(డీఆర్‌పీ) లక్ష్మి తెలిపారు. స్థానిక పామర్రు సచివాలయం–1 వద్ద ఆదివారం గ్రామ స్థాయిలో ఉపాధి హామీ పథకం పనుల సామాజిక తనిఖీ గ్రామ సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామంలో సుమారు 40 వేల పని దినాలను చేశామన్నారు. ఈ తనిఖీలో కూలీల సంతకాలు చేయకుండా కూలీల వేతనాలు తీసుకున్నట్లు గుర్తించామని అన్నారు. మేట్లు, ఫీల్డు అసిస్టెంట్లు కొన్ని చోట్ల ఫీల్డులో హాజరు తీసుకోకుండా నిర్వహించినట్లు గుర్తించామని తెలిపారు. పనులు జరిగిన చోట కొలతలలో కొన్ని తేడాలు ఉన్నట్లు గుర్తించామని చెప్పారు. ఈ విషయాలపై ఫీల్డు అసిస్టెంట్లు మండల స్థాయి సమావేశంలో వివరణ ఇవ్వాల్సి ఉంటుందన్నారు. గ్రామ ఉప సర్పంచ్ దేవిరెడ్డి బాల వెంకటేశ్వరరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామ కార్యదర్శి అబ్దుల్ సలీం, ఎన్ఆర్‌ఈజీఎస్ ఏపీవో పోలు రాజు, ఫీల్డు అసిస్టెంట్లు రమేష్ పవిత్ర, గ్రామస్తులు పాల్గొన్నారు.

పెద్దింట్లమ్మ దేవస్థానంలో భక్తుల రద్దీ



పెద్దింట్లమ్మ దర్శనానికి వచ్చిన భక్తులు

కైకలూరు: కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద ఆదివారం భక్తుల రద్దీ కనిపించింది. ఏలూరు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. వేడి నైవేద్యాలను సమర్పించారు. సర్కారు కాల్వపై కర్రల వంతెన స్థానంలో వారధి నిర్మించడంతో ద్విచక్రవాహనాలు, ఆటోలలో వేలాది మంది భక్తులు నేరుగా అమ్మవారి దేవస్థానానికి చేరుకుంటున్నారు. ఆలయ ఈవో కందుల వేణు గోపాలరావు భక్తులకు కావల్సిన ఏర్పాట్లు పర్యవేక్షించారు. సమీప జిల్లాల్లో ఎక్కడా లేని విధంగా పెద్ద అనివేటి మండపం పనులు దేవాలయం వద్ద శరవేగంగా జరుగుతున్నాయని ఈ సందర్భంగా ఈవో తెలిపారు.

పేద విద్యార్థులకు ఆర్థికసాయం



చెక్కులు స్వీకరించిన విద్యార్థులతో మానవత స్వచ్ఛంద సేవా సంస్థ సభ్యులు

కైకలూరు: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ కైకలూరు ఆధ్వర్యంలో ఆదివారం పేద విద్యార్థులకు ఆర్థిక సహాయం పంపిణీ చేశారు. పది, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ చదువుతున్న పేద విద్యార్థులు ఆరుగురికి రూ.47,000 విలువ చేసే చెక్కులను సంఘ అధ్యక్షుడు కొండ్రెడ్డి సత్యనారాయణ ఇంటి వద్ద పంపిణీ చేశారు. నంబూరి వెంకటపతిరాజు, పేరిచర్ల రామరాజు, కొండ్రెడ్డి ప్రభాకర్‌రావు, మహమ్మద్ గాలిబ్ బాబు, రుద్రపాక రత్నారావు, సీహెచ్ బాలాజీ, ఇందుకూరి వెంకటరామరాజు, బొమ్మనబోయిన విజయలక్ష్మి, తలారి గోపాలకృష్ణ, గుర్రం శ్యాంకుమార్, ఉద్దగిరి విజయకుమార్, ఇమ్మడి విటల్ పాల్గొన్నారు.

గుమ్మడి కాదు.. బొప్పాయే..



గుమ్మడి కాయ ఆకారంలో బొప్పాయి పండు

అచ్చం గుమ్మడి కాయ మాదిరిగా బొప్పాయి పండు దర్శనమిస్తోంది. కైకలూరు కుమారి టాకీస్ సమీపంలోని శ్రీనివాసరావు ఇంటి వద్ద బొప్పాయి చెట్టుకు గుమ్మడికాయ ఆకారంలో బొప్పాయి కాయ కాసింది. పలువురు గుమ్మడికాయ రూపం సంతరించుకున్న బొప్పాయి కాయను చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. – కైకలూరు

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
గుడివాడ డివిజన్
99516 02865 (గుడివాడ)
99516 02985 (కైకలూరు)
90105 77706 (పామర్రు)
Office mail : sakshiads@gmail.com